నిర్లక్ష్యం వద్దు

# ఓటేద్దాం.. ఎన్నుకుందాం.!

బాధ్యతతో మెలుగు





• నేటి ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ • ఎస్‌హెచ్‌ఓల పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు • ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరుతున్న అధికారులు



కృష్ణకుంజ్ గార్డెన్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన స్లిప్‌ల పంపిణీ



దుండిగల్‌లోని ఓ పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామగ్రిని బస్సులో తీసుకువచ్చిన దృశ్యం



దుండిగల్‌లో ఓ బూత్‌లో పోలింగ్ ఏర్పాట్లలో నిమగ్నమైన ఎన్నికల సిబ్బంది



కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో పోలింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు ఆధ్వర్యంలో అల్వాల్ లయోలా కాలేజీ నుంచి సామగ్రిని సిబ్బంది ఆయా పోలింగ్ స్టేషన్లకు తరలించారు. ఇప్పటికే గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓల పర్యవేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. గత వారం రోజులుగా సమస్యాత్మక పాంతాలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు ఇప్పటికే రౌడీషీటర్లను బైండోవర్ చేసి వారిపై నిఘా పెట్టారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో గొడవలు చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించారు.

### ప్రజలకు అందని ఓటర్ స్లిప్పులు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బూత్ లెవెల్ సిబ్బంది, అంగన్‌వాడీ, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కానీ అత్యధిక ప్రాంతాల్లో వీటిని పంపిణీ చేయలేకపోయారు. దీంతో సంక్షేమ సంఘం ప్రతినిధులే ఓటర్ స్లిప్పులను ఇంటింటికీ పంచుతూ కనిపించారు.

◆ ఇదే క్రమంలో కొంతమంది పార్టీ నాయకులు సైతం ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ స్లిప్పులు పంపిణీ చేస్తూ ప్రచారం చేసుకోవడం గమనార్హం. అత్యధిక కాలనీలో ప్రజలకు ఓటర్ స్లిప్పులు అందకపోవడంతో ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన యాప్‌ల ద్వారా తమ పోలీస్‌స్టేషన్ వివరాలు తెలుసుకునే పనిలో పడ్డారు.

◆ జీడిమెట్ల డివిజన్ కృష్ణకుంజ్ గార్డెన్‌లో సుమారు 600పైగా ఓట్లు ఉండగా ఇక్కడ ఏ ఒక్క అధికారి, సిబ్బంది స్లిప్పులు అందజేయకపోవడంతో సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి వారికి పోలింగ్ కేంద్రాల స్లిప్పులను అందజేయడం కనిపించింది.

| నియోజకవర్గంలో ఓటర్లు ఇలా | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 7,24,992 |
| పురుషులు | 3,78,362 |
| మహిళలు | 3,46,468 |
| ఇతరులు | 162 |
| పోలింగ్ కేంద్రాలు | 592 |

### సెంటర్‌ను సందర్శించిన జనరల్ అబ్జర్వర్

◆ అల్వాల్ లయోలా కేంద్రంగా ఉన్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను మల్కాజ్‌గిరి పార్లమెంటు ఎన్నికల జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ప్రియాంక శుక్లా సందర్శించారు. అసెంబ్లీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పులి సైదులుతో పాటు సిబ్బంది ఈవీఎంలు వివిధ పోలింగ్ కేంద్రాలకు తరలించే ఏర్పాట్లను ఆమె స్వయంగా పరిశీలించి తగు సూచనలు చేసింది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వివాదాలకు తావు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



దూలపల్లిలో ఓ బూత్ ముందు ఓటర్ల కోసం వేసిన టెంట్లు



ఈవీఎంలను పోలింగ్ బూత్‌లకు తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్న ఎన్నికల సిబ్బంది



దీపోచంపల్లిలోని ఓ పోలింగ్ బూత్‌కు చేరుకున్న ఎన్నికల సిబ్బంది




సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పులి సైదులు



లయోలా కళాశాల నుండి పోలింగ్ బూత్‌లకు తరలి వెళ్తున్న సిబ్బంది



లయోలాలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ప్రియాంక శుక్లా

## స్ట్రాంగ్ రూమ్‌లో పోస్టల్ బ్యాలెట్ బాక్సులు

పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీజ్ చేసిన రిటర్నింగ్ అధికారి

సాక్షి,మేడ్చల్‌జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా భోగారంలోని హోలీ మేరీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్‌రూమ్‌లో ఆదివారం పోలైన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను భద్రపరిచారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ పరిధిలో పోలైన పోస్టల్ బ్యాలెట్ సీల్డ్ బాక్సులను పోలీసుల బందోబస్తుతో వివిధ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీల్‌చేసి భద్రపరచినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గౌతమ్ తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా భోగారంలోని హోలీ మేరీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఆదివారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ను తరలించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు మేడ్చల్, ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, కంటోన్మెంట్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల నిర్వహణలో భాగంగా 8,066 బ్యాలెట్ ప్యాట్లు, 4,032 కంట్రోల్ ప్యాట్లు, 4,515 వీవీ ప్యాట్లను ఎన్నికల సిబ్బంది తరలించారు. వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌతమ్ ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఈవీఎంలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలతో పటిష్టమైన పోలీసు భద్రతతో పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

## ముస్లిం రిజర్వేషన్ల రద్దు లౌకికవాదానికి విరుద్ధం

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం ప్రజాస్వామ్య, లౌకిక, గణతంత్ర విధానానికి పూర్తి విరుద్ధమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. మన దేశం లౌకిక ప్రజాస్వామ్య దేశమని చెప్పుకున్నప్పటికీ ప్రధానమంత్రి ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. అన్ని వర్గాలకు, అన్ని మతాలకు సమానమైన హక్కులు, ప్రయోజనాలు కల్పించాలని రాజ్యాంగం నిర్దేశించినప్పటికీ సాక్షాత్తు దేశ ప్రధాని ఈ విధంగా మత రాజకీయాలు చేయడం దురదృష్టకరమని అన్నారు. తెలంగాణలో ఇస్తున్న 4 శాతం రిజర్వేషన్లు మతపరమైనవి కావని, ముస్లింలలో ఉన్న పలు ఉపకులాలు, ప్రాతినిధ్యం లేని వర్గాలకు ఇస్తున్నవని పేర్కొన్నారు. సంపద ఉన్న వర్గాలను తొలగించి అర్హత కలిగిన వారికి మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తున్నారన్నారు.

## వేలిపై సిరా చుక్క.. కంప్యూటర్ కోర్సులో 80శాతం రాయితీ పక్కా

కాచిగూడ: ఓటు వేయండి.. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో 80 శాతం రాయితీతో శిక్షణ పొందండి అంటూ పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆదివారం ప్రకటించింది. యువతలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు, ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ ద్వారా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఈ రాయితీని ప్రకటించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. 80 శాతానికి పైగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓటు వేసిన సిరా గుర్తు గల వేలిని చూపిస్తూ సెల్ఫీ దిగి వాట్సాప్ నెంబర్ సెల్: 9505800047 కు పంపిన యువతీ యువకులకు, విద్యార్థులకు కోర్సు ఫీజులో 80 శాతం రాయితీ కూపన్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఆన్‌లైన్ కోర్సుల వివరాలు, రిజిస్ట్రేషన్ వివరాలు పంపడం జరుగుతుందన్నారు.

## సినిమాలు యువతను పెడదారి పట్టించొద్దు

'గాంజా శంకర్' సినిమా పేరు మార్చండి: వేముల రామకృష్ణ

కాచిగూడ: యువతను పెడదోవ పట్టించే విధంగా సాయిధరమ్ తేజ్ నటించిన 'గాంజా శంకర్' సినిమా పేరును వెంటనే మార్చాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. గాంజా శంకర్ సినిమా పేరుపై సినిమా నిర్మాత, దర్శకులు పునరాలోచించాలని ఆయన సూచించారు. ఇలాంటి పదాల వల్ల సమాజంపై ముఖ్యంగా విద్యార్థులు, యువతపై పెనుప్రభావం చూపుతుందని ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో పేరున్న పెద్ద హీరోలు సినిమాల్లో ధూమపానం, మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారని, ఈ హీరోలు నేటి యువతకు ఏమి సందేశం ఇవ్వదల్చుకున్నారని ఆయన ప్రశ్నించారు. కమర్షియల్ సినిమాలు తీయడంలో తప్పులేదని, కానీ మన సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోయి యువతను పెడదోవ పట్టించే విధంగా ఉన్న సినిమాలు చేస్తే అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. దీనిపై సెన్సార్ బోర్డు స్పందించి సినిమా దర్శక, నిర్మాతలకు నోటీసులు అందజేయాలని ఆయన కోరారు.

## 14న భగీరథ మహర్షి జయంతి వేడుకలు

సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరిశేఖర్

గచ్చిబౌలి: భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరిశేఖర్ తెలిపారు. గచ్చిబౌలి అంజయ్యనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కఠోర దీక్షతో ఒంటి కాలిపై తపస్సు చేసి పరమ శివుడిని ఒప్పించి పవిత్ర గంగను దివి నుంచి భువికి తీసుకొచ్చిన మహనుభావుడు భగీరథుడు అని అలాంటి మహనీయుని జయంతి వేడుకలను నిర్వహించడం సమాజానికి అవసరమన్నారు. సగరజాతి కులగురువైన ఆయన వేడుకలను తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామ, మండల, జిల్లా కేంద్రాలలో కూడా సగరులు ఎక్కడికక్కడ ఘనంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు భగీరథుని జయంతి వేడుకలు జరుపుతున్నప్పటికీ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి ఎన్నికల కోడ్ రావడంతో ఈ ఏడాది నిర్వహించడం లేదని స్పష్టం చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే వేడుకల్లో బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు,బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఇతర ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు.

## దొంగల ముఠా అరెస్టు

లాలాపేట: దృష్టి మరల్చి దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్న ఓ ముఠాను అరెస్టు చేసిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ముఖేష్ (35) మేస్త్రీ. ఈ నెల 6న నాగోల్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి తన సామగ్రితో ఆటో కోసం వేచి ఉన్నాడు. అదే సమయంలో బార్కాస్‌కు చెందిన యాసిన్ అలీ ఖాద్రీ(21) సెంట్రింగ్ వర్కర్, పహాడిషరీఫ్‌కు చెందిన షేక్ ఉమ్రాన్, లారీ మెకానిక్, యా కుత్‌పురాకు చెందిన సయ్యద్ ఆదిల్(24) కార్ వాషింగ్ కార్మికుడు, సజ్జు నలుగురు ఆటోలో వచ్చి అతన్ని ఆటో ఎక్కించుకున్నారు. మార్గమధ్యలో మాటలతో అతన్ని దృష్టి మరల్చి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించారు. తార్నాకలో గుడ్ లాండ్ బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు రాగానే ఆటోలో స్థలం సరిపోవడం లేదంటూ దించేశారు. దీంతో బాధితుడు మరో ఆటోలో సికింద్రాబాద్‌కు చేరుకున్నాడు. అక్కడికి వెళ్లి చూసుకునేసరికి తన సెల్‌ఫోన్ కనిపించలేదు. మొదటి ఆటోలోని తోటి ప్యాసింజర్లుగా నటించిన వారే తన ఫోన్ చోరీ చేశారని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్టు చేయగా ఒకరు పరారీలో ఉన్నారు. వీరిపై గతంలో పలు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## కుత్బుల్లాపూర్‌లో పోలింగ్ కేంద్రాలు 582

# ఒక్కో బూత్‌లో 1500 మంది ఓటేయొచ్చు

అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు



కుత్బుల్లాపూర్: ప్రశాంత వాతావరణంలో లోక్‌సభ ఎన్నికల జరిగే విధంగా ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు అన్నారు. సోమవారం జరుగనున్న మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన ఏర్పాట్లపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

◆ పోలింగ్ బూత్‌కు వచ్చే ఓటర్లు తమ వెంట కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన 16 గుర్తింపు కార్డుల్లో ఏదైనా చూపించి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవచ్చు.

◆ పోలింగ్ బూత్‌లలో దొంగ ఓట్లకు ఆస్కారం లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టామన్నారు. ముందుగా ఓటు వేసేందుకు వచ్చిన వారి వివరాలను ఏజెంట్లు తమ లిస్ట్‌లో ఉన్నది లేదని సరి చూసుకున్న తరువాతే అధికారులు ఓటు వేసేందుకు అనుమతిస్తారు.

◆ వేసవి నేపథ్యంలో ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే టెంట్ల ఏర్పాటుతో పాటు తాగునీటిని అందుబాటులోఉంచారు.

◆ పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్టమైన రక్షణ ఏర్పాట్లను చేశారు. ఇప్పటికే పోలింగ్ బూత్ సమీపంలో 144 సెక్షన్ అమలులోకి వచ్చింది. పోలీస్ సిబ్బందితో పాటు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఫోర్స్, 46 మంది సెక్టోరియల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు బూత్‌ల వద్ద పర్యవేక్షిస్తారు.

◆ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 582 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఒక్కోబూత్‌లో 1500 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అదే విధంగా 1600లకు మించి ఓటర్లు ఉన్న 10 బై పస్ కేంద్రాలు ఉన్నాయి.

◆ ఈవీఎంలు మొరాంచడం, సాంకేతిక సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. 582 పోలింగ్ కేంద్రాలకు గాను 582 ఈవీఎంలు ఉండగా అదనంగా 30 శాతం ఈవీఎంలను అందుబాటులో ఉంచారు.

◆ మొత్తం 46 మంది సెక్టోరియల్ ఆఫీసర్లు ఉండగా ఒక్కొక్కరి వద్ద రెండు చొప్పున ఈవీఎంలు అందుబాటులో ఉంచారు. ఏదైనా పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు పనిచేయని పక్షంలో స్థానిక ఎన్నికల అధికారి నుంచి సంతకం తీసుకుని సెక్టోరియల్ అధికారి వారికి మరోక ఈవీఎంను అందజేసేలా చర్యలు తీసుకున్నారు.

◆ నియోజకవర్గ వ్యాప్తంగా 62 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎన్నికల అధికారులు లోపల, ప్రాంగణంలో సీసీ కెమెరాలను అమర్చారు. ఎప్పటికప్పుడు సీసీ ఫుటేజీల ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన మైక్రో అబ్జర్వర్ అక్కడి పరిస్థితులను జనరల్ అబ్జర్వర్‌కు చేరవేస్తారు.

◆ నియోజకవర్గంలో దాదాపు ఓటర్‌స్లిప్‌ల పంపిణీ పూర్తి చేశారు. ఒకవేళ ఎవరికైనా ఓటర్ స్లిప్‌లు అందకుంటే జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు, బీఎల్‌ఓలను సంప్రదిస్తే వాటిని పొందవచ్చు.

◆ పోలింగ్ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటలకు కొనసాగుతుందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములు కావాలన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు షురూ

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (రాజేంద్రనగర్)లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బయాలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని రాజేంద్రనగర్ కళాశాలకు మొదటి ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441956233, 7032713785 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## ఎండ తగలకుండా..!



షాపూర్‌నగర్ సిగ్నల్ వద్ద చలువ పందిరి

రంగారెడ్డినగర్: వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్న దృష్ట్యా వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గాజులరామారం వైపు షాపూర్‌నగర్‌కు వచ్చే వాహనదారులకు షాపూర్‌నగర్ సిగ్నల్స్ సమీపంలో ఎండ తగలకుండా చౌరస్తాలో చలువ పందిరిని ఏర్పాటు చేశారు. దీంతో సిగ్నల్స్ పడిన సందర్భంలో వాహనదారులకు పందిరి కింద నీడ ఉండటంతో కాస్త ఉపశమనం కలుగుతుందనే ఉద్దేశంతో ఏర్పాటు చేశామన్నారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

## తాత్కాలిక బస్ షెల్టర్లు

సుభాష్‌నగర్: ఇటీవల మండుతున్న ఎండలకు బస్ షెల్టర్ లేని ప్రాంతాల్లో అధికారులు తాత్కాలికంగా బస్ షెల్టర్లు ఏర్పాటు చేశారు. కొంపల్లిలోని 44వ జాతీయ రహదారిపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలా నాలుగు చోట్ల ఏర్పాటు చేయడం జరిగింది.



కొంపల్లిలోని 44వ జాతీయ రహదారి పక్కన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్ షెల్టర్

# కుత్బుల్లాపూర్‌లో ఆధిక్యత ఏ పార్టీదో.?



కుత్బుల్లాపూర్: ప్రతి నలుగురు కలిస్తే ఈసారి నియోజకవర్గంలో ఆధిక్యత ఎవరిది? అనే విషయంపై ఒకటే చర్చ. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలకు... లోక్‌సభ ఎన్నికలకు చిన్న తేడా కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కొలను హన్మంత్‌రెడ్డి, బీజేపీ నుంచి కూన శ్రీశైలం గౌడ్, బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పోటీ చేశారు. ఈ ముగ్గురిలో ఒకరైన కూన శ్రీశైలంగౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఆ పార్టీ బలం మరింత పెరిగింది. అయితే ఎన్నికల్లో ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు గత నెల రోజులుగా ఇద్దరు నాయకులు విశ్వప్రయత్నాలు చేశారు. తమ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని గల్లీ గల్లీకి వెళ్లి అభ్యర్థించారు.

◆ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్‌కు రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిచిన అభ్యర్థిగా రికార్డు ఉంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులు సైతం తమదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోయారు. తనకు వచ్చిన భారీ మెజార్టీ తన పార్టీ అభ్యర్థికి వచ్చేలా ప్రచారం చేశారు. అదే విధంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ సైతం ప్రచారం చేసి ఓటర్లను తమ వైపు తిప్పుకునేలా కృషి చేశారు.

◆ మాజీ మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ ఈ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ప్రజల్లో మంచి నాయకుడిగా పేరున్న ఈటల రాజేందర్ తన ఇమేజ్‌ను పక్కన పెట్టి గల్లీ లీడర్లను సైతం కలుపుకుని ప్రచారం చేశారు. ఈటలకు మద్దతుగా కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ నాయకులు వచ్చి జోరుగా ప్రచారం చేశారు. ఇంత ప్రచారం చేసినా ఓటర్లు ఎటువైపు అనేది ఆసక్తికరంగా మారింది.

### కాంగ్రెస్‌కు ఆధిక్యత వచ్చేనా..?

◆ గత అసెంబ్లీ ఎన్నికల్లో వేరువేరు పార్టీలో టికెట్లు సొంతం చేసుకొని పోటీపడ్డ కొలన్ హన్మంత్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్ ఒకే గూటికి చేరడంతో కాంగ్రెస్ పార్టీకి ఇక్కడ మెజార్టీ వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. వీరిద్దరూ లక్షకుపైగా ఓట్లు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి వివేకానంద్ రాష్ట్రంలోనే అత్యధికంగా మెజార్టీ ఈ నియోజకవర్గం నుంచి రావడం విశేషం.

◆ కూన చేరికతో కాంగ్రెస్ పార్టీకి బలం చేకూరుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తుండగా బిజేపికి గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు వస్తాయా..! రావా అన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఆ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ దూకుడుగా ప్రచారం చేసినప్పటికీ కిందిస్థాయి నాయకులు మాత్రం తూతూమంత్రంగా తిరిగినట్లు ఆ పార్టీ కార్యకర్తలే బాహటంగా విమర్శిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూరేలా ఉంది.

### 'రావుల'రాకతో బీజేపీకి ఓట్లు పెరిగేనా..?

◆ గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అనూహ్యంగా బీజేపీలో చేరి బీఆర్‌ఎస్ పార్టీకి ఝలక్ ఇచ్చారు. ఆయన డివిజన్‌లో ముస్లిం ఓటర్లు అధికంగా ఉండగా ఇక్కడ రావుల రాకతో బీజేపీకి బలం చేకూరుతుందా అనేది ఇక్కడ ప్రశ్నగా ఉంది. గ్రేటర్ పరిధిలో అంతర్భాగంగా ఉన్న గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్లలో బీజేపీకి ప్రస్తుతం ఇద్దరు కార్పొరేటర్లు ఉన్నారు. జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ తార చంద్రారెడ్డి, ఇటీవల చేరిన రావుల శేషగిరి రాకతో ఆ పార్టీకి ఓట్లు పెరుగుతాయా లేవా అనేది తేలాల్సి ఉంది. ఏది ఏమైనా జూన్ 4వ తేదీన కౌంటింగ్ రోజు వీరి బలబలాలు తేలే అవకాశాలు ఉన్నాయి.

# యథేచ్ఛగా రోడ్ల ఆక్రమణలు



సంజయ్‌గాంధీనగర్ - గాంధీనగర్ రోడ్డులో ఓ పరిశ్రమ ముందు ఇనుమ సామగ్రిని డంప్

రంగారెడ్డినగర్: పారిశ్రామికవాడ ప్రాంతాల్లో యథేచ్ఛగా రోడ్ల ఆక్రమణలకు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పారిశ్రామికవాడల్లోని పచ్చదనాన్ని పెంపొందించేందుకు వదిలిన ఖాళీ స్థలాలను పార్కింగ్‌లకు అడ్డాలుగా మారాయి. తాజాగా రోడ్లను సైతం వదలడం లేదు. పలు పరిశ్రమల నిర్వాహకులు వస్తు సామగ్రిని రోడ్ల పక్కన నిల్వ ఉంచుతూ రాకపోకలకు ఆటంకాలు సృష్టిస్తున్నారు. గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతంలోని సంజయ్‌గాంధీనగర్ - గాంధీనగర్ రోడ్డులో ఓ ఫ్యాబ్రికేషన్ ఇంజినీరింగ్ పరిశ్రమ యాజమాన్యం రోడ్డును ఆక్రమించి భారీ ఇనుప సామగ్రిని డంప్ చేశారు. అంతే కాకుండా రోడ్డుకు ఓ పక్క ఇనుప ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసి తమ స్థలంగా వాడుకుంటున్నారు. ఇలా రోడ్ల అక్రమణలకు పాల్పడుతున్న పరిశ్రమల యాజమాన్యాలు గుర్తించి ఐలా అధికారులు కఠినంగా వ్యవహరించాలని మిగతా పరిశ్రమల యాజమాన్యాలు కోరుతున్నాయి.

## ఎంత ఎండ కొట్టినా 'ఇక్కడ చల్లగా ఉంటుంది'

రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న తరుణంలో రోడ్డు పై ప్రయాణించాలంటేనే నరకం కనిపిస్తోంది. కానీ ఆ కాలనీలోనీ ప్రధాన రోడ్డుపై మాత్రం ఎంత ఎండ కొట్టినా నీడనే ఉంటుంది. గతంలో రోడ్డుకు ఇరువైపులా పెట్టిన చెట్లు నేడు మహావృక్షాలై, మండుటెండల్లో సైతం ఆహ్లాదంతో పాటు నీడను చల్లటి గాలిని అందిస్తుంది. ఏసీ చూడాలంటే ఓసారి జీడిమెట్ల డివిజన్ రాఘవేంద్ర కాలనీకి వెళ్లాల్సిందే.

– సుభాష్‌నగర్:



రాఘవేంద్ర కాలనీ ప్రధాన రోడ్డుపై పందిరి వేసిన మాదిరిగా ఉన్న చెట్లు..